


# చూడకురా చెడేవు

**- పాత్రికేయ**

**అది న్యూఢిల్లీలోని గయారామ్ సూపర్ స్పెషాలిటీ కార్పొరేట్ ఆస్పత్రి. వేగంగా దూసుకొచ్చిన అంబులెన్స్ ఎమర్జెన్సీ విభాగం దగ్గర సడెన్ బ్రేకుతో ఆగింది. కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ ఆఫీసర్ దివాలా దీక్షిత్ (57)ని అంబులెన్స్‌లోంచి దించిన అంబులెన్స్ సిబ్బంది ఆయన్ని యమర్జెంటుగా ఎమర్జెన్సీ విభాగంలోకి తీసుకెళ్ళారు. డాక్టర్లు అవసరమైన టెస్టులన్నీ చేసేసి, ఇమ్మీడియట్‌గా ఐ.సి.యు.కి తరలించారు. దివాలా దీక్షిత్ ట్రీట్‌మెంట్ బాధ్యతని సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ నరమ్‌సింగ్‌కి అప్పగించారు. డాక్టర్ నరమ్‌సింగ్ క్షణం కూడా రెస్ట్ తీసుకోకుండా దివాలా దీక్షిత్ ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తున్నాడు.**

**తర్వాత ఆస్పత్రిలోని డాక్టర్లందరూ ఒకచోట చేరి చాలాసేపు చర్చించుకున్నారు. ఆ చర్చల సారాంశం ఒకే ఒక్కవాక్యంలో... ''హే భగవాన్.. విధి ఎంత బలీయమైనది? మన దేశంలోనే ఒక అద్భుతమైన ఆఫీసర్ దివాలా దీక్షిత్ గారికి ఎలాంటి పరిస్థితొచ్చి పడింది? ఆయన ఆఫీసులో ఉండగా ఇలా జరిగిందంట. ఆయన ఆరోగ్యం బాగుపడాలని ఆ భగవంతుడిని ప్రార్థిద్దాం. దురదృష్టవశాత్తూ ఆయనకేమైనా అయితే ఆయన డైరెక్టుగా స్వర్గానికి వెళ్ళాలని కోరుకుందాం.''**

ఓ గంట తర్వాత దివాలా దీక్షిత్ గారి సతీమణి శ్రీమతి శోకితా బెన్ భోరున ఏడ్చుకుంటూ గయారామ్ ఆస్పత్రిలోకి ప్రవేశించింది. ఆమె పాతికేళ్ళ కొడుకు కుక్షిబేటా తల్లిని ఓదార్చడానికి విఫలయత్నం చేస్తున్నాడు. ఆస్పత్రి సిబ్బంది వీళ్ళిద్దర్నీ డైరెక్టుగా డాక్టర్ నరమ్‌సింగ్ దగ్గరకు తీస్కెళ్ళి కూర్చోబెట్టారు.

డాక్టర్ నరమ్‌సింగ్ అరివీర భయంకరంగా ఏడుస్తున్న శ్రీమతి శోకితా బెన్‌తో- ''మీరు శోకాలు పెట్టడం ఆపితేనే నేనేమైనా మాట్లాడగలను'' అన్నాడు.

శోకితాబెన్ ఏడుపు ఆపకపోగా సౌండ్ మరింత పెంచి- ''ఢాక్టరు గారూ... మా ఆయనకి ఏమైందో చెప్పండి.. ఆయనకేమైనా అయితే నేను ఇక్కడే చచ్చూరుకుంటా'' అంది. నరమ్‌సింగ్ కాస్తంత ఇబ్బందిగా కుక్షిబేటా వైపు చూశాడు. కుక్షిబేటా తల్లిని నోరు మూయమన్నట్టుగా సీరియస్‌గా చూడ్డంతో శోకితాబెన్ శోకించడం ఆపింది. అప్పుడు కుక్షిబేటా నిబ్బరంగా- ''డాక్టర్, మా డాడీకి ఏమైంది? ఇప్పుడాయన ఎలా ఉన్నారు?'' అని ప్రశ్నించాడు.

నరమ్‌సింగ్ గాఢంగా నిట్టూర్చి- ''దివాలా దీక్షిత్ గారి మైండ్‌లో నరాలన్నీ జామ్ జామ్ అయిపోయాయి. ప్రస్తుతం ఆయన సెమీ కోమాలోకి వెళ్ళిపోయారు. దీనివల్ల ఆయన కట్టెలా బిగుసుకుపోయి ఉన్నారు. అయితే కళ్ళు మాత్రం నిరంతరం తెరచి ఉంచి అన్నిట్నీ చూడగలుగుతున్నారు. గంటకోసారి మూర్ఛ వచ్చినట్టుగా షేకవుతారు. ఓ పావుగంట అలా షేకై మళ్ళీ నార్మలవుతారు. నిజం చెప్పాలంటే ప్రస్తుతం ఆయన పరిస్థితి అప్పుడప్పుడూ షేకయ్యే శవంలా వుంది'' అని వివరించారు.

కుక్షిబేటా తన బాధను అదుముకుంటూ- ''మా డాడీ మైండ్‌లో నరాలన్నీ ఎందుకు జామ్ జామ్ అయి ఉండొచ్చని భావిస్తున్నారు డాక్టర్?'' అని ప్రశ్నించాడు.

నరమ్‌సింగ్ తీవ్రంగా ఆలోచించేసినట్టుగా ఫేసు పెట్టి- ''మీ నాన్న గారి ఆఫీసులో ఆయన తలమీద ఎవరో ఓ పెద్ద సుత్తితో కొట్టుంటారని నాకు అనుమానంగా ఉంది. కానీ ఆయన తలమీద ఎలాంటి గాయమూ లేదు. ఎవరోగానీ తలమీద దెబ్బ కనిపించకుండా, లోపల నరాలన్నీ కదిలిపోయేలా కొట్టారని అనిపిస్తోంది... మీ డాడీకి ఆఫీసులో ఎవరైనా శత్రువులున్నారా?'' అన్నాడు.

''మా డాడీ అజాత శత్రువు సార్. ఆయన బుర్రని రాంకీర్తన పాడించాల్సిన అవసరం ఎవరికీ లేదు'' అన్నాడు కుక్షిబేటా.

''ఈ విషయం మీద ఇప్పటికే పోలీస్ కంప్లయింట్ ఇవ్వడం జరిగింది. అసలింతకీ మీ డాడీవాళ్ళ ఆఫీసులో ఏం జరిగిందనేది ఇప్పుడే పోలీస్ కమిషనర్ గారికి ఫోన్ చేసి కనుక్కుంటాను. ఫోన్ స్పీకర్‌లో మీరు కూడా వినండి'' అని పోలీస్ కమిషనర్‌కి ఫోన్ చేశాడు డాక్టర్ నరమ్‌సింగ్.

''ట్రింగ్.. ట్రింగ్..''

''హలో.. పోలీస్ కమిషనర్ స్పీకింగ్.. ఎవుడ్రా అది?''

''హలో.. సర్.. నేను గయారామ్ ఆస్పత్రి నుంచి డాక్టర్ నరమ్‌సింగ్‌ని''

''ఓహో... మీరా డాక్టర్ గారూ? సారీ వెరీమచ్. అన్నట్టు నాకో ప్రాబ్లమొచ్చి పడింది డాక్టర్ జీ. ఈమధ్య నా బాడీలో కొన్ని ఇంపార్టెంట్ నరాలు పనిచేయట్లేదు.. దానికి నన్నేం చెయ్యమంటారో చెప్పండి డాక్టర్''

''మీ నరాల గోల గురించి తర్వాత మాట్లాడ్దాం కమిషనర్ గారూ... ముందు దివాలా దీక్షిత్ గారి కేసు గురించి చెప్పండి. ఆఫీసులో ఆయన తలమీద సుత్తితో కొట్టిందెవరో కనిపెట్టారా?''

''సుత్తితో కొట్టడమా బొంగా? ఆయనే చేతు లారా, తలారా ఇదంతా చేసుకున్నాడు. ఈ విష యంలో తప్పంతా దివాలా దీక్షిత్ గారిదే!''

''ఈజిట్? అసలేం జరిగింది? నాకు తెలి యాలి''

''చెప్తా... అసలింతకీ దివాలా దీక్షిత్ గారి ఆఫీస్‌లో ఏం జరిగిందంటే....'

* * *

సమాచార మంత్రిత్వ శాఖ కార్యాలయంలోకి హుందాగా ప్రవేశించాడు దివాలా దీక్షిత్. ఆయన తన కేబిన్ వైపు నడిచి వెళ్తుంటే అందరూ ఎంతో వినయంగా 'గుడ్మాణింగ్ సార్' అనసాగారు. దివాలా దీక్షిత్ అందరికీ ప్రతి విషెస్ చేస్తూ ముందుకు వెళ్తున్నాడు.

ఇంతలో దివాలా దీక్షిత్ చూపు తాళం వేసి ఉన్న ఓ గదిమీద నిలిచింది. అంతే! ఆయన అప్ప టికప్పుడే అక్కడికక్కడే ఆగిపోయి- ''సెక్రట్రీ'' అని పిలిచాడు.

సెక్రట్రీ వినయంగా- ''సార్'' అన్నాడు.

''చాలాకాలం నుంచి చూస్తున్నాను. తాళం వేసి ఉన్న ఈ రూమ్‌లో ఏం ఉంటాయి?''

''ఇది పనికిరాని వస్తువులుంచే స్టోర్‌రూమ్ సార్. ఈమధ్యకాలంలో నేషనల్ అవార్డు పరిశీల నకు వచ్చిన చాలా తెలుగు సినిమాల ప్రింట్లని ఈ రూమ్‌లోనే పడేస్తున్నాం సార్''

''తెలుగు సినిమాలా? వెరీ నైస్. నాకు ఎప్ప ట్నుంచో తెలుగు సినిమాలని చూడాలని మహా ఇది. అంచేత ఓ నాలుగు లేటెస్టు తెలుగు సినిమా లని బయటకి తీసి, మన ఆఫీసులో ఉన్న మినీ థియేటర్‌కి పంపించు. ఇవాళ నాకు వేరే పనేమీ లేదు. హాయిగా ఆ తెలుగు సినిమాలు చూస్తా''

''సార్, ఈ ఏడాది జాతీయ అవార్డులు పొందిన తమిళ, మలయాళ, కన్నడ భాషల సిని మాలు నిన్ననే మీరు చూశారు. అంత మంచి సిని మాలు చూసి మీ మైండ్ చాలా సున్నితంగా మారి ఉంటుంది. అలాంటి మైండ్ ఉన్న మీరు వెంటనే తెలుగు సినిమాలు చూస్తే ఏదైనా ఇబ్బంది కలగొ చ్చేమో ఆలోచించండి''

''అంత సీన్ లేదులే సెక్రట్రీ.. ఇలాంటి అను మానాలేవీ పెట్టుకోకుండా అర్జెంటుగా తెలుగు సినిమాల స్క్రీనింగ్ ఏర్పాటు చెయ్''

''సరే మీ ఖర్మ... సారీ.. మీ ఇష్టం సార్. మేం మాత్రం మీతోపాటు తెలుగు సినిమాలు చూడం''

దివాలా దీక్షిత్ ఆదేశాల మేరకు సెక్రట్రీ 'నేనే పుండాకోర్', 'ఎంట్రా', 'చింతలేని చింతామణి', 'అడ్డంగా నరుకుతా' అనే నాలుగు లేటెస్ట్ తెలుగు సినిమాల ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశాడు. చిరునవ్వు చిందుతున్న ముఖంతో సినిమాలు చూడడం ప్రారంభించిన దివాలా దీక్షిత్ నాలుగో సినిమా అయిపోగానే పావుగంట సేపు గిలగిలా కొట్టుకుని కట్టెలా బిగుసుకుపోయాడు.

సినిమాల ప్రదర్శన పూర్తయ్యాక సెక్రట్రీ థియేటర్లోకి వెళ్ళాడు. అక్కడ దివాలా దీక్షిత్ పరిస్థి తిని అర్థం చేసుకుని అంబులెన్స్ కోసం గయా రామ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఫోన్ చేశాడు.

* * *

''....ఇదీ జరిగింది. దీన్నిబట్టి ఏంటంటే, తెలుగు సినిమాలు చూడ్డం వల్ల గురుడికి జంక్షన్ బాక్సు జామైపోయింది. ఇంతకంటే జరిగిందేమీ లేదు కాబట్టి ఈ కేసు క్లోజ్ చేస్తున్నాం'' అని వివరిం చాడు పోలీస్ కమిషనర్. కమిషనర్‌కి థ్యాంక్స్ చెప్పి ఫోన్ కట్ చేసిన డాక్టర్ నరమ్‌సింగ్ ఎదురుగా ఉన్న శోకితాబెన్, కుక్షిబేటాల ముఖాల్లోకి చూశాడు.

తల్లీ కొడుకుల ముఖాలు పాలిపోయి ఉన్నాయి. కుక్షిబేటా గొంతు పెగల్చుకుని- ''తెలుగు సినిమాలకి ఇంత పవరుంటుందా డాక్టర్?'' అని ప్రశ్నించాడు.

''తెలుగు సినిమాలకే అంత పవరుంటది. మీ డాడీ లాంటి కేసులని గతంలో నేను కొన్నిట్ని ట్రీట్ చేశాను. తెలుగు సినిమాలు చూసి కొంత మందికైతే కళ్ళు, ముక్కు, చెవుల వెంట రక్తం కారిన సందర్భాలు కూడా ఉన్నాయి. మీ డాడీ నిజంగా అదృష్టవంతుడు... ఓ మోస్తరుగా బయట పడ్డాడు'' అని చెప్పాడు నరమ్‌సింగ్.

''తెలుగు వాళ్ళు తెలుగు సినిమాలనే రెగ్యుల ర్‌గా చూస్తూ ఉంటారు. బంపర్ హిట్లు చేస్తూ ఉంటారు. మరి వాళ్ళకేమీ కాదా డాక్టర్?'' ధర్మ సందేహాన్ని వ్యక్తం చేశాడు కుక్షిబేటా.

''చెత్త ప్రశ్న. చెత్త సినిమాలు చూసీ చూసీ తెలు గువాళ్ళ బుర్రలు స్ట్రాంగ్‌గా, చెత్తకుండీల్లా అయిపో యాయి. అందువల్ల వాళ్ళకి ఏమీ కాదు. పైగా చెత్త సినిమాలు చూడ్డం అలవాటై వాళ్ళకి చెత్త సిని మాలు మాత్రమే నచ్చుతూ ఉంటాయి. అలాంటి చెత్త సినిమాలనే వాళ్ళు హిట్ చేస్తూ ఉంటారు. చెత్త సినిమాలే హిట్టవుతున్నాయని నిర్మాతలు, దర్శ కులు మళ్ళీ మళ్ళీ చెత్త సినిమాలనే తీస్తూ ఉంటారు. ఇదంతా ఒక 'చెత్త్రభమణం'. ఆ సినిమాలు చూస్తే మనలాంటి తెలుగేతరులకు మాత్రం చిత్త్రభ మణం'' అని లెక్చరిచ్చాడు నరమ్‌సింగ్.

కుక్షిబేటా దీనంగా ముఖం పెట్టి- ''మరి అలాంటి చెత్త తెలుగు సినిమాల ప్రభావం వల్ల పేషెంటుగా మారిన మా డాడీ మళ్ళీ మామూలు మనిషి అవుతారంటారా?'' అని ప్రశ్నించాడు.

''తప్పకుండా అవుతారు. తెలుగు సినిమాలు చూసి మైండు ఖరాబైపోయిన వాళ్ళకి చాలా శ్రద్ధతో ప్రత్యేకమైన ట్రీట్‌మెంట్ ఇవ్వాలి. ఈరోజే మీ డాడీని మీ ఇంటికి తీసుకెళ్ళండి. నేను రాసిచ్చే మందులు నేను చెప్పిన ప్రకారం క్రమం తప్ప కుండా వాడితే మీ డాడీ కోలుకునే అవకాశం ఉంది'' అన్నారు డాక్టర్ గారు.

శోకితాబెన్, కుక్షిబేటా ముఖాల్లో కాంతి కని పించింది. ''తప్పకుండా డాక్టర్.. మీరు రాసిచ్చే మందులు మీరు చెప్పినట్టు వాడతాం. మా దేవుణ్ణి కాపాడుకుంటాం'' అని ఇద్దరూ ముక్తకంఠంతో అరిచారు.

డాక్టర్ నరమ్‌సింగ్ మందుల ప్రిస్క్రిప్షన్ మీద ఏదో రాసి కుక్షిబేటాకి ఇస్తూ- ''ప్రస్తుతానికి ఒక వారానికి మందులు రాసిస్తున్నాను. ఈ మందుల్లో రోజుకో మందు క్రమం తప్పకుండా వాడి, వారం తర్వాత కనిపించండి. మళ్ళీ కొత్త మందులు రాసి స్తాను'' అన్నాడు.

కుక్షిబేటా మందుల కాగితం చదివి అదిరి పోయాడు. అందులో మందుల పేర్లకు బదులు...

1. మల్లీశ్వరి (పాతది)
2. మాయాబజార్
3. గుండమ్మ కథ
4. మిస్సమ్మ
5. మూగమనసులు
6. ముత్యాల ముగ్గు
7. శంకరాభరణం

...అని తెలుగు సినిమాల పేర్లు రాసున్నాయి.

కుక్షిబేటా వణుకుతున్న గొంతుతో- ''డాక్టర్... ఇదేంటి మందుల బదులు తెలుగు సినిమాల పేర్లు రాసిచ్చారు?'' అని ప్రశ్నించాడు.

''ఆ తెలుగు సినిమాలే మీ డాడీ రోగానికి మందులు. వాటిలో రోజుకో సినిమా మీ డాడీకి చూపించు. వారం తర్వాత వస్తే మరో ఏడు తెలుగు సినిమాల పేర్లు రాసిస్తాను'' తాపీగా అన్నాడు డాక్టర్ నరమ్‌సింగ్.

''డాక్టర్.. మీరసలు మనిషేనా? తెలుగు సిని మాలు చూసి దిమాగ్ ఖరాబైన మా డాడీకి మళ్ళీ తెలుగు సినిమాలనే చూపించమంటున్నారా? అస లేంటి మీ ఉద్దేశం? ఆయన్ని చంపేయాలనుకుం టున్నారా?'' అని ఆగ్రహంతో ఊగిపోతూ ప్రశ్నిం చాడు కుక్షిబేటా.

నరమ్‌సింగ్ ప్రశాంతంగా నవ్వి- ''ఆవేశ పడకు మిస్టర్ కుక్షిబేటా! ఉష్ణం ఉష్ణేణ శీతలః.. తెలుగు సినిమాల ద్వారా వచ్చిన మెంటల్ని తగ్గించే శక్తి ఆ తెలుగు సినిమాలకే ఉంది. ఈనాటి చెత్త తెలుగు సినిమాలు చూసి మైండు ఖరాబు చేసుకున్న మీ డాడీకి నేను రాసిచ్చిన ఆనాటి మంచి తెలుగు సినిమాలు చూపించాలి. అప్పుడే ఆయన ఆరోగ్యం కుదుటపడుతుంది. మీ డాడీ రోగానికి ఇంతకంటే వేరే మందు లేదు. అంచేత వేరే డొట్లు పెట్టుకోకుండా నేను రాసిచ్చిన తెలుగు సినిమాలు చూపించు. ఆయన తప్పకుండా కోలు కుంటారు'' అని భరోసా ఇచ్చాడు.

శోకితాబెన్, కుక్షిబేటా అంతా మీదే భారమ న్నట్టు డాక్టర్ నరమ్‌సింగ్‌కి చేతులు జోడించారు. ఆ తర్వాత కట్టెలా బిగుసుకుపోయి కళ్ళు పత్తి కాయల్లా తెరుచుకుని ఉన్న దివాలా దీక్షిత్‌ని కార్లో ఎక్కించుకుని ఇంటికి బయల్దేరారు. దార్లో వీడియో సి.డి.ల షాపు దగ్గర ఆగి, డాక్టర్ నరమ్ సింగ్ రాసిచ్చిన తెలుగు సినిమా మందులు కొను క్కుని మరీ ఇంటికెళ్ళారు.

దివాలా దీక్షిత్ ఆరోగ్యం త్వరలోనే తప్ప కుండా బాగుపడుతుంది. మరి మన తెలుగు సిని మాలు ఎప్పటికి బాగుపడతాయో, ఏంటో!

★

patrikeya@gmail.com